# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పౌష్టికాహారం, వ్యాయామంతో రక్తపోటు సమస్యను నివారించవచ్చని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం. టి. కృష్ణబాబు అన్నారు.
- ❖ ముడి సరుకు లభ్యత ఆధారంగా ఉక్కు ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారిస్తామని విశాఖ స్టీల్ ప్లాంట్ సీఎండి అతుల్ భట్ తెలియజేశారు.
- ❖ వేసవి రద్దీ దృష్ట్యా భువనేశ్వర్ నుంచి సోలాపూర్, ముంబై నగరాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

==========================

పౌష్టికాహారం, వ్యాయామంతో రక్తపోటు సమస్యను నివారించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం. టి. కృష్ణబాబు అన్నారు. రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఈరోజు మంగళగిరి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధిపతులు, అధికారులు, వైద్య నిపుణులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రజలకు అవగాహన పెంపొందించి, వారిలో రక్తపోటు నివారణకు కృషి చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. పండ్లు, కాయగూరలు, చిరుధాన్యాలు, ఉప్పు తక్కువగా వుండే ఆహార పదార్థాల వినియోగంతో పాటు, క్రమం తప్పని శారీరక వ్యాయామాలు కొనసాగించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, రక్తపోటును నివారించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు పునరంకితమవుతామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు.

==========================

గంగవరం పోర్టు నుండి విశాఖ ఉక్కు కర్మాగారానికి ముడి సరుకు రవాణాకు మార్గం సుగమం అయ్యిందని సీఎండి అతుల్ భట్ తెలిపారు. పోర్టు కార్మికుల ఆందోళన కారణంగా గత నెల 12వ తేదీ నుండి గంగవరం పోర్ట్ లిమిటెడ్ కార్యకలాపాలు స్తంభించాయని, దీంతో కీలక ముడి పదార్థాలైన కోకింగ్ బొగ్గు, సున్నపురాయి రవాణా నిలిచిపోవడంతో ఉక్కు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించడంలో భాగస్వాములైన వారందరికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ముడి సరుకు లభ్యత ఆధారంగా దశల వారీగా ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారిస్తామని, జరిగిన నష్టాన్ని నెల రోజుల్లో తగ్గించేందుకు కృషి చేస్తామని సీఎండి వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్ నుంచి సోలాపూర్, ముంబై నగరాలకు ఈ నెల 20వ తేదీన రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కే.సందీప్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సోలాపూర్ వెళ్లే రైలు భువనేశ్వర్ లో తెల్లవారుజామున 4 గంటల 30 నిమిషాలకు బయలుదేరనుండగా... ముంబై వెళ్లే రైలు రాత్రి భువనేశ్వర్ లో 11 గంటలకు బయలుదేరుతుందని తెలియజేశారు. విజయనగరం, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తున్న ఆయా రైళ్ల సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 19వ తేదీ నాటికి దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం లోని కొన్ని ప్రాంతాలతో పాటు నికోబార్ దీవులలోకి ప్రవేశించే అవకాశం ఉందని వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లాలో 2023-24 రబీ పంట కాలానికి సంబంధించి రైతుల నుండి ఒక లక్షా 97 వేల 129 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినట్టు జిల్లా సంయుక్త కలెక్టర్ లావణ్యవేణి తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని రాండమ్ సెలెక్షన్ ద్వారా అనుసంధానం చేసిన ధాన్యం మిల్లులకు తరలించినట్టు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం ఇంతవరకు 225.67 కోట్ల రూపాయల మొత్తాన్ని రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగినదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో రైతులు సిద్ధం చేసిన ధాన్యాన్ని... కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి, గోనె సంచులు, రవాణ సౌకర్యాలు సమకూర్చి ధాన్యం మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. క్వింటాల ధాన్యానికి కామన్ రకానికి 2 వేల 183 రూపాయలు, గ్రేడ్ - A రకానికి 2 వేల 203 రూపాయల మద్దతు ధర చెల్లించనున్నట్టు జాయింట్ కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ పొగాకుకు విదేశాలలో మంచి డిమాండ్ ఉందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఒంగోలులోని పొగాకు బోర్డు రీజనల్ కార్యాలయంలో వేలం కేంద్రాల అధికారులు, రైతు ప్రతినిధులతో ఈరోజు ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గత సంవత్సరం కంటే కిలోకు 30 రూపాయలు అధికంగా ఈ ఏడాది 262 రూపాయల ధర లభించిందన్నారు. ఇప్పటి వరకు 62 మిలియన్ కిలోల పొగాకు కొనుగోళ్లు జరిగాయని, ఈ సంవత్సరం 201 మిలియన్ కిలోల మేర ఉత్పత్తి జరిగినట్టు అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇక్కడి పొగాకును దాదాపు 100 దేశాలకు ఎగుమతి చేస్తున్నామని, ఎగుమతి అవకాశాలను సద్వినియోగం చేసుకునే దిశగా బోర్డు చర్యలు తీసుకుంటుందని శ్రీధర్ బాబు తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో బాలల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర డీజీపీను ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేస్తూ... ఎన్నికల అనంతరం రాష్ట్రంలో జరిగిన అల్లర్ల నేపధ్యంలో బాలలు, మహిళలు భయభ్రాంతులకు గరవుతున్నట్టు కమిషన్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు, దుర్ఘటనలకు సంబంధించి ఒక నివేదిక అందజేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇన్ సర్వీస్ కోటా కింద పీజీ కోర్సులు పూర్తి చేసిన కొంత మంది ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించారని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ సర్వీస్ వైద్యులు పీజీ కోర్సుల్లో చేరే సమయంలో ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఐదేళ్లపాటు ప్రభుత్వానికి సేవలందించాల్సి ఉందని, అయితే... కొంతమంది ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ షరతును ఉల్లంఘించిన వారు 20 లక్షల రూపాయలతో పాటు, ప్రభుత్వం చెల్లించిన జీత భత్యాలను తిరిగి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వైద్యులకు పలుమార్లు నోటీసులు జారీ చేశామని, వారు జూన్ 15వ తేదీలోగా స్పందించని ఎడల వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీ. కే. బాలాజీ... రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన జిల్లా రెవిన్యూ అధికారి కే. చంద్రశేఖర రావుతో కలిసి సంబంధిత అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలు జరిగిన అంశాన్ని ప్రస్తావిస్తూ... ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎక్కడా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా జాగ్రత్త వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో తహసిల్దారులు, పోలీసు అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలతో సమన్వయం చేసుకొని ప్రతిరోజు శాంతి భద్రతలపై నివేదిక పంపాలన్నారు. ఎక్కడైనా ఘర్షణలు జరిగితే తక్షణమే స్పందించి నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వైద్య విద్యా డైరెక్టరేట్ ఆధ్వర్యంలోని వైద్య కళాశాలల్లో 29 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... శాశ్వత ప్రాతిపదికన డైరెక్ట్ పోస్టింగ్, ఇంకా... లేటరల్ ఎంట్రీ ద్వారాను ఈ పోస్టుల్ని భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఫేజ్ - 2 గవర్నమెంట్ మెడికల్ కాలేజీలలో బ్రాడ్ స్పెషాలిటీలో ఈ పోస్టుల్ని భర్తీ చేస్తామని వివరించారు. మరిన్ని వివరాల కోసం dme.ap.nic.in లేదా apmsrb.ap.gov.in/msrb వెబ్‌సైట్లను సందర్శించాలని, ఈ నెల 27వ తేదీ లోపుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్జితసేవా టికెట్లు రేపు ఉదయం విడుదల కానున్నాయి. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటన చేస్తూ... కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేస్తామని పేర్కొంది. అదేవిధంగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్ల కోటాతో

పాటు శ్రీవారి ఆలయంలో ఆగస్టు 15 నుండి 17వ తేదీ వరకు జరగనున్న వార్షిక పవిత్రోత్సవాల సేవా టికెట్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =